# గరుడసేవ

కరుణకుమార



'అయ్యా, శింగరయ్యా! గ్రామ చావడిలో కూర్చుని మునసబూ, కరణం, ధర్మకర్తా పిలుచుకొని రమ్మన్నారయ్యా, నిన్ను!' అని అప్పుడే భోజనంచేసి చుట్ట ముట్టించబోయే శింగరశెట్టితో చెప్పాడు-చాకలివాడు.

కరణం, మునసబూ, ధర్మకర్తా,గ్రామచావడీ!

శింగరశెట్టికి భయంవేసింది. గ్రామ పెద్ద లెన్నడూ తన నావిధంగా కబురుచేసినదిలేదే! తనవల్ల తప్పేమీ జరుగలేదుగదా! చేతిలో చుట్ట గూటిలోపెట్టి పైన గుడ్డవేసుకొని బయల్దేరాడు——శింగర.

పెద్దరెడ్డీ, చలమానాయుడూకూడా వచ్చి గ్రామ చావడిలో కూర్చుని ఉన్నారు.

'రావయ్యా, శింగరయ్యా!' అని అందరూ ఒక్కసారి ఆహ్వానంచేశారు. మనస్సు కుదుటపడి స్తిమితపడ్డాడు - శింగరయ్య.

'శింగరశెట్టి తలుచుకొంటే కార్యం అయిపోయిందన్న మాటే' అని ఉపక్రమించాడు వేణుగోపాలస్వామి దేవళం ధర్మకర్త.

'అతగాడి కిదో లెఖా, జమా' అన్నాడు చలమయ్య.

'నలుగురితోపాటు నారాయణా అంటాడు గాని కాదంటాడా ఏమి'టన్నాడు - మునసబు.

'అసలు విషయమేమిటో శలవిచ్చారుకా'దన్నాడు శింగరయ్య.

'ఏమున్నదీ? మూడేళ్లయింది వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవంతిరనాళ్లు నిలిచిపోయి. నాపెత్తనంవచ్చినముప్ఫయ్యేళ్లుగాఒక సంవత్సరం కూడా నాగా జరగకుండా జరిపించాను - తిరనాళ్లు. అటువంటిది మూడేళ్లుగా ముగించుకొని కూర్చున్నాం,ఇంతమంది పెద్దలుండీకూడా.' అన్నాడు ధర్మకర్త.

శింగర పలకలేదు.

'ఆ ఏడు శేతువురెడ్డి ఇంట్లో పిల్లవాడు నష్టమైపోయి అతడు ఉభయం చేయించకపోతే, ఇంతమంది ఉండీ ఆ ఒక్క ఉభయం సర్దుకోలేక పోయాారు. అదే మొదలు తిరనాళ్ళు నిలిచి పోడానికి గ్రామానికి సిడి పట్టుకోడానికీని.'

'.........'

'ఆ మరుసటి సంపత్సరం సరేసరి. వసంతసేవ ఉభయం చేయించే గొల్లవాళ్లల్లో ఉప్పత్తలుపడి మావల్ల కాదని మొంకొడ్డుకొని కూర్చున్నారు. ఆ ఏడూ జరగలేదు స్వామి కళ్యాణం.'

'.........'

'నిరుడు సంవత్సరం కోమటి నర్సయ్య చచ్చి పోవడంతో, అన్ని ఉభయాల్లోకీ పెద్దది గరుడ సేవ ఉభయం నిలిచి దానితో పెద్ద దెబ్బ తగిలింది - తిరనాళ్ళకి.'

'.........'

'స్వామికార్యంపట్ల ఇట్లా ఉపేక్షచేయడం శ్రేయస్సుకాదని నేను మొన్నటిరోజు శేతువు రెడ్డితోనూ, గొల్లవాళ్ళతోనూ ప్రస్తావనచేస్తే, వాళ్ళు ఈ ఏడు చేయించడానికి ఆక్షేపణలేదని చెప్పారు.'

శింగరశెట్టి ఊకొట్టి ఊరుకున్నాడు.

'ఎటువచ్చీ కోమటి నర్సయ్య గరుడసేవ ఉభయమే బకాయిపడేటట్టుగా ఉన్నది. ఈ ఉభయంగనక శింగరశెట్టి సర్దుకుంటే, ఈ ఏడు మళ్ళా స్వామికి కళ్యాణం జరిగిందన్న మాటే.' అన్నాడు - ధర్మకర్త.

'అయ్యబాబో! అంత బరువే' అన్నాడు-శింగర.

'అట్లా అనబోకోయ్ శింగరా: వర్తకుని ఉభయం వర్తకుడే సర్దుకోవాలి. ఈ వూరు వచ్చిన తరువాత స్వామిదయవల్లవృద్ధికివచ్చావు. నీకూ బిడ్డా పాపా లేరు. నామాట వింటే నీకు ఆ కొరతా తీరుతుం'దన్నాడు - ధర్మకర్త.

[illegible] సావకాశయ్యా [illegible]." అన్నాడు- చలమయ్యగారు.

గ్రామపెద్దలనుకాదనలేకపోయాడు- శింగర.

'ఇప్పటికన్ని ఉభయాలూ కుదిరినట్టేనా' అని అడిగాడు- మునసబు.

"ఇదిగో వినండి-
అంకురార్పణఉభయం నాది.
ధ్వజారోహణఉభయం కరణానిది.
హనుమంతుసేవఉభయం మునసబుది.
గరుడసేవఉభయం శింగరశెట్టిది.
కళ్యాణంఉభయం చలమయ్యది.
వసంతసేవఉభయం గొల్లవాండ్లది.
ఏకాంతసేవ ఉభయం శేతుపురెడ్డిది."
అన్నాడు ధర్మకర్త.

నలుగురూ లేచి చక్కా వెళ్లారు.

## 2

ఆ వూరు అంత పెద్దదీగాదు, అంతచిన్నదీ గాదు. అంతా పదిహేనువందల జనాభా, మూడువందల ఇళ్లూ, ఇంత పాడీ పంటా-నిండుగానే ఉంటుంది గ్రామం. నాలుగు వీధులూ కలిసేచోట పెద్ద మర్రిచెట్టూ. చెట్టు కెదురుగ్గా వేణుగోపాలస్వామి ఆలయం, ఆలయానికి దక్షిణంగా గ్రామచావడీని. గ్రామంలో నాలుగు నియోగుల యిళ్లూ, ఆరు వైదికుల కుటుంబాలూ, అయిదు కోమట్ల లోగిళ్లూ, మిగిలినది శూద్ర గడపాను.

ధర్మకర్త చెప్పినట్లు ఈ మూడేళ్లుగా అనివార్యమైన ఇక్కట్లవల్ల స్వామితిరునాళ్లు నిలిచిపోవలసివచ్చిందిగాని లేకుంటే ముప్ఫయ్యేళ్లకుపైగా తిరునాళ్లు అవిచ్ఛిన్నంగా జరుగుతూవచ్చిన మాట నిజమే.

తెల్లవారితే జ్యేష్ఠశుద్ధ ద్వాదశీ శుక్రవారం అనగా వేకువజామున అంకురార్పణ ఆరంభించారు- ధర్మకర్త. దేవాలయం ఆవరణలో పెరిగిన చెత్తా చెదారం, పల్లేరుకాయలూ, చెక్కించి బాగుచేయించాడు. దేవళం ఆవరణలో పందిళ్లూ కొత్తాయిలూ వేయించాడు. మంచినీళ్లబావికి పడమటగా వంటపందిరీ భోజనాలశాలా వేయించాడు. దేవళంమీది పాచి తుడిపించి సున్నం కొట్టించాడు. పదిబిందెలనీళ్ళతో ధ్వజస్తంభం కడిగించాడు.

గ్రామం నాలుగువీధుల్లోనూ దేవుణ్ణి నిలబెట్టి హారతులియ్యడానికి చలవ పందిళ్ళు వేసి ముగ్గుల్లు పెట్టించాడు.

దేవళాని కెదురుగ్గా వీధుల్లో నులకమంచాల మీద తాటాకు గొడుగులక్రింద రకరకాల బొమ్మలదుకాణాలూ, మిఠాయి అంగళ్ళూ బయల్దేరి గ్రామాని కెంతో శోభ తీసుకొని వచ్చినవి.

ధర్మకర్త వైదికి బ్రాహ్మణుడు: దేవాలయ ఆదాయవ్యయాలన్నీ అతని చేతిమీదుగానే జరుగుతున్నవి. ఖర్చులుపోను ఆదాయంలో మిగులుతూనే ఉందో లేక అతని చేతిదే తగులుతూనేఉందో—ఎవరికి కావాలి ఈ గొడవ! ఎండోమెంటు బోర్డువారికి ధర్మకర్తే లెఖలూ డొక్కులూ వ్రాసి పంపుకుంటున్నాడు.

కాని కరణం నియోగిబిడ్డ. అగ్గితునక. దేవుడి భూములు కాని బ్రాహ్మణభూములుగాని, మాల మాదిగ భూములుగాని, కరణం సాగుబడి లెఖ వ్రాయాలి, కరణం తణిఖీ చేయాలి, మునసబు తరఫున శిస్తువసూలుకూడా కరణమే చేయాలి. అటువంటి పరిస్థితులలో ధర్మకర్త తింటూఉన్న దేవాలయం ఆదాయంలో కరణం తనకికూడా ఒకభాగం యివ్వవలసిందని ధర్మకర్తని లోపాయికారిగా అడిగించడం అదొకలెఖలోని విషయం కాదు.

ధర్మకర్త కరణానికి సూదిబెజ్జం అంత సందయినా ఇవ్వలేదు. కరణానిది తాచుపాము పగ.

దేవళంసాకర్ల నెత్తికొట్టి దేవుడిమాన్యం మీద వచ్చేఆదాయంలో ఏటా అధమం రెండు పుట్ల గింజలయినా ధర్మకర్త కాజేస్తున్నాడని కరణానికి మండిపోతూంది. ఆ రెండుపుట్లలో తనకో పాతిక పాలయినా పంచి యివ్వకూడదూ ఆ ధర్మకర్త: ఈ కరువురోజుల్లో పందుం గింజలు తనయింటికి నడిచిరావలసిన వ్యవహారం. ఎందుకు పోవాలీ: కరణానికి తపనగా ఉంది.

## 3

జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమినాటి రాత్రి శింగరశెట్టి గరుడసేవ ఉభయం. మొదటి మూడు ఉభయాలూ చిన్నవి- ఏదో అయిందనిపించారు.

శింగరశెట్టి ఈ కార్యంలోమట్టుకు బారు గానే పోనిచ్చాడు చెయ్యి. అదిగాక తన ఐశ్వర్యాభివృద్ధికి వేణుగోపాలస్వామి దయే అని అతని విశ్వాసం.

బంధువుల్ని పదిమందినీ పిలుచుకొన్నాడు. స్వామిఅలంకారానికి పదిమైళ్ళ నుండి పుష్పం తెప్పించాడు. అలంకారం చేయడానికి ఓవరహా సంభావ నిచ్చి ప్రత్యేకంగా ఒక కంసాలిబత్తుణ్ణి పిలిపించుకొన్నాడు. స్వామికి వెండిపాదాలూ, వెండిహస్తాలూ చేయించాడు.

పున్నమినాటి వెన్నెల. జ్యేష్ఠమాసం. ఓ! జనం చేరిపోయారు. పందిట్లో భోగంమేళం మేజువాణీ జరుగుతోంది. వాహనాల కొట్టుకి తెర అడ్డుకట్టి, గరుడవాహనంమీద స్వామికి అలంకారం చేస్తున్నారు. మేజువాణీకి చేరిన పెద్దలకందరికీ గంధం, పన్నీరూ, తాంబూలం స్వయంగా పంచుతున్నాడు- శింగర. ఆకాశంలో చుక్కల్ని మ్రింగిన చంద్రుడిప్రతిబింబాల్లా ఉన్నాయి, పందిట్లో ప్రమిదదీపాలను మింగి గ్యాసులైట్లు. నిండుజవ్వనుల శృంగారవిజృంభణాలతో దేవళం ఆవరణ యావత్తూ ఆనందమయమై అలరారుతోంది.

రాత్రి పదకొండు గంటలయింది. చంద్రబింబం నెత్తికెక్కింది. స్వామి అలంకారం పూర్తిఅయిందన్నారు. వాహనాలకొట్టుకు కట్టిన అడ్డుతెర తొలగించుమన్నాడు ధర్మకర్త. స్వామికి దిగదుడిచి మూడు టెంకాయలు పగలకొట్టారు. ఇరవయిమంది చాకళ్ళు వాహనం ఎత్తుకొన్నారు. దేవళంవాకిట నిలబెట్టారు. ఇరువురు వైష్ణవులు వాహనంమీద నిలబడి స్వామికి వీవనలు వీస్తున్నారు. అర్చకుడు పెద్దపళ్ళెంలో పంచకజ్జాయం స్వామికి నివేదనచేశాడు. హారతి పళ్లెం తిప్పాడు. కళ్ళ కద్దుకున్నాడు-శింగరశెట్టి. గోవిందా అని కేకలు మిన్నుముట్టినవి. మేజువాణీ నిలిపివేశారు. ధర్మకర్త పంచకజ్జాయం పళ్లెం చేతికి తీసుకొన్నాడు. ముందు బ్రాహ్మ



ణులకు పంచిపెట్టాడు. బ్రాహ్మణు లందరూ అయినారా అని కేకపెట్టాడు. జవాబు లేదు.

శింగరశెట్టిని పిలిచి- ప్రసాదం అతనిచేతిలో పెట్టాడు ధర్మకర్త.

'కరణంగారికి ముట్టలేదు- బ్రాహ్మ లందరూ కాకుండానే ముందుగా వర్తకులకు పెట్టుతున్నారు ప్రసాదం' అని గుంపులోనుండి కేక బయల్దేరింది.

'చూడలేదు పొరపాటు' అన్నాడు ధర్మకర్త.

'ఎందుకుచూస్తావూ- కండకావరం' అన్నాడు కరణం.

'మాటలు సరిగా రానీయకుంటే దవడపళ్లు రాలగొట్టుతా' అన్నాడు ధర్మకర్త.

'కొట్టరా' అని ధర్మకర్తపొట్టమీద తన్నేడు కరణం. చాకలివాడి చేతిలో బోటుకర్ర పెరుక్కున్నాడు- ధర్మకర్త. కాగడా లాక్కున్నాడు- కరణం.

'కొట్టుకోబోకండి స్వామీ' అని నడుంగా దూరాడు శింగరశెట్టి.

ఎత్తిన కర్రలూ, కాగడాలూ శింగరశెట్టి నెత్తినపడి అతడు క్రిందబడ్డాడు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# ప్రాచీన గ్రీసుదేశంలో వివాహాలు

సిద్ధాంతి మల్లికార్జునం

ప్రాచీన గ్రీసు దేశంలో సర్వతో ముఖాభివృద్ధి జెందిన లలిత కళలకు స్థావరమైనది ఏథెన్సు నగరం. ఆ నగర ఆచార వ్యవహార సాంప్రదాయాలుకూడా లలిత కళలవలెనే మనోరంజకములైనవి. అటువంటి నగరములో వివాహసాంప్రదాయాలనుగూర్చి తెలుసుకొనడం చాలా అవసరం.

అతిప్రాచీనకాలంలో, అనగా చరిత్రకందని కాలంలో, మంచి విలువైన బహుమతులచేత స్త్రీ హృదయాన్ని వశం చేసుకొని ఆమెను భార్యగా స్వీకరిస్తూండేవారు. కాని క్రమేణా చరిత్రయుగ ప్రారంభంనుంచీ ఈ పద్ధతి క్షీణదశలోకి వచ్చింది.

సాధారణంగా వివాహసంబంధాలన్నీ తల్లిదండ్రుల కృషిచేతగాని,మధ్యవర్తుల సహాయంతోగాని నిశ్చయింపబడుతూండేవి. వివాహనిశ్చయ సందర్భంలోగాని, వరకట్ననిర్ణయ సందర్భంలోగాని ఎథీనియనులు చాలా జాగ్రత్త తీసుకుంటూండేవారు. కారణాంతరాలవల్ల భార్య విడాకులిచ్చినప్పుడుగాని, ఆమె మరణించినప్పుడుగాని, తిరిగి ఆమెవైపువారికి ముట్టచెప్పవలసిన వరకట్న నిర్ణయ విషయంలోగాని వారు ఎంతో శ్రద్ధ తీసుకుంటూండేవారు.

వివాహాలన్నీ ఒకేనగరంలో నివసించే కుటుంబాల మధ్య, అందులో పదింట తొమ్మిదిపాళ్లు ఒకే అంతస్తు వారిమధ్యనే విధిగా జరుగుతూండేవి.

ఎవరైనా, నగరానికి ప్రశంసార్హమైన సేవచేసి విధివశాన దారిద్ర్య బాధకు లోనైనప్పుడు అటువంటి పౌరుల కుమార్తెల వివాహ సందర్భంలో ప్రభుత్వమే అప్పుడప్పుడు వరకట్నాలను చెల్లిస్తూండేది.

శాస్త్రబద్ధమైన వివాహపు తంతు పెండ్లివారు తాంబూలాలు పుచ్చుకొనడంతో ముగిసిపోతుంది. మిగిలిన పెండ్లికార్యాలన్నీ మత సంబంధమైనవైనప్పటికీ, తన్నిర్వహణకు పురోహితుని యావశ్యకతలేదు. పెండ్లి విందుకుముందే వివాహదేవతలను ఆవాహనచేసి వారికి బలులు మొదలైనవిచ్చి తృప్తి పరుస్తారు.

ఆ దేవతలకు బలి ఇచ్చిన జంతువుల మాంసము విందులో ముఖ్యమైన భోజ్యవస్తువు. ఈ మాంసమును పచనం చేసేటప్పుడు జంతువు శరీరంలో 'లివరు'ను సంబంధించిన భాగం తప్ప తక్కిన పేగులన్నిటిని కాలుస్తారు. ఆ లివరు భాగాన్ని కాల్చకుండా వదలినట్లయిన, ఏలాటి